క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వేమూరు: వేమూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పోతుమర్రు ఫీడర్ మీద మరమ్మతుల పనులు చేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని అసిస్టెంట్ ఇంజనీరు గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చంపాడు, పోతుమర్రు, జంపని గ్రామాల్లో విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రేపల్లె రూరల్: పట్టణంలోని ఇసుకపల్లి మసీదు సెంటరు నుంచి నిజాంపట్నం రోడ్డు చివరి వరకు ఈ నెల 21వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని శుక్రవారం ఒక ప్రకటనలో ఏఈ శివనాగిరెడ్డి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశం

రేపల్లె రూరల్: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 21వ తేదీ శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు మండల పరిషత్ సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఎం.శోభారాణి చెప్పారు. వివిధ అభివృద్ధి అంశాలపై ఎంపీపీ పెనుమాల సుశీల అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

టైలర్ మృతికి సంతాపం

భట్టిప్రోలు: భట్టిప్రోలుకు చెందిన టైలర్ బి.పోతురాజు అనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం టైలర్స్ అసోసియేషన్ సంతాప సూచకంగా షాపులను మూసివేశారు. ఈ సందర్భంగా పోతురాజు కుటుంబ సభ్యులను అసోసియేషన్ నిర్వాహకులు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎండీ ఇస్మాయిల్, పి.నాగేశ్వరరావు, ఎన్.సుబ్బారావు, బషీర్, వి.నాగరాజు, వి.నాగేశ్వరరావు, ఎండీ అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో సామూహిక హారతులు



చెరుకుపల్లి: దేవాలయాల్లో సామూహిక హారతులు ఇవ్వటం ద్వారా ఆయా గ్రామాలతో పాటు ప్రజలందరికీ మేలు జరిగి సుఖశాంతులతో వర్ధిల్లుతారని సమరసత సేవ ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మార్గశిర మాసంలో వచ్చే ధనుర్మాసం చాల విశిష్టమైనదని, ప్రతి హిందువు ఈ నెల రోజులు గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. ధనుర్మాసం సందర్భంగా గుళ్ళపల్లి గ్రామంలో వేంచేసియున్న గంగాబికా సమేత ఆనందీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పలువురు మహిళలు స్వామి, అమ్మవార్లకు సామూహిక హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, పడమట వెంకటేశ్వరరావు, ఓగిరాల వీరాస్వామి, ఉల్లంగుంట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

చర్చి స్లాబ్ నిర్మాణంలో పాల్గొన్న సంఘస్తులు



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయం పునర్నిర్మాణ పనుల్లో భాగంగా శుక్రవారం స్లాబ్ నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘస్తులు స్వచ్ఛందంగా పాల్గొని తలా ఒక చేయి వేశారు. రెవరెండ్ మద్దిరాల ఆనందరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, ఏఈఎల్‌సీ నిర్వాహకులు, సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, అంబేడ్కర్ యూత్, సండే స్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.

ఆటలో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

చెరుకుపల్లి: క్రీడాకారులు ఆటలో క్రీడా స్ఫూర్తితో వారి నైపుణ్యాన్ని చూపి జట్టు విజయానికి కృషి చెయ్యాలని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్ అన్నారు. ఈ నెల 14న నరసరావుపేటలో నిర్వహించిన జిల్లా బాలికల జట్టుకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. వారికి మండలంలోని వనజాచంద్రా పబ్లిక్ స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడు రాధా కృష్ణారెడ్డి, ప్రసాద్‌లు శిక్షణ ఇచ్చారు. ఈ జట్టు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే 50వ కబడ్డీ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తుందని ప్రసాద్ తెలిపారు. హెచ్ఎం గోగినేని శ్వేత, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అంతా.. మా ఇష్టం.. మేం చెప్పినట్టే జరగాలి

టీడీపీ నేతల హుకుం

- రహదారుల నిర్మాణంలోను రాజకీయాలు
- నగరంలో వేసిన సీసీ రహదారులపైనే మరలా వేస్తున్న వైనం
- అధ్వానంగా మారిన అంతర్గత రహదారులు
- రహదారులను అభివృద్ధి పరచాలని కోరుతున్న గ్రామస్తులు



సినిమా హాల్‌కు వెళ్లే సీసీ రహదారిపై మరలా నిర్మాణానికి వేసిన కీవాల్స్

నగరం: అంతా.. మా ఇష్టం.. అధికారం మాది.. మేం చెప్పినట్టే జరగాలి.. చెప్పింది చెయ్యకపోతే.. సెలవు పెట్టి వెళ్లండి.. అంటూ టీడీపీ నాయకులు హుకుం జారీచేస్తుండటంతో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా పనులు చేస్తున్నారు. పల్లె పండుగ పేరుతో గ్రామాలలో సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు. రహదారులు అధ్వాన్నంగా ఉన్న చోట సీసీ రోడ్లులు వేయాల్సి ఉండగా.. సీసీ రహదారులపైనే మరలా రహదారులు వేస్తుండటం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలో 23 పనులకు రూ.3.20 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో కూటమి నేతలు తమకు ఇష్టం వచ్చిన చోట రహదారులు బాగానే ఉన్న వాటిపై మరలా వేస్తుండటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరం గ్రామంలో పలు



అధ్వానంగా ఉన్న పోలీస్‌స్టేషన్ రహదారి

అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్న వాటినీ అభివృద్ధి పరచకుండా బాగున్న వాటిపై మరలా వేయడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు

నగరం గ్రామ పంచాయతీ పరిధిలో మాన్యంవారిపాలెం, కాపులపాలెం, యాదవపాలెం, ఎస్టీ కాలనీ, ఘాలివారిపాలెం, శ్మశానవాటికలకు వెళ్లే రహదారులు మరింత దయనీయంగా మారాయి. అయితే ఈ రహదారులను అభివృద్ధి పరచకుండా వాటి నిర్మాణంలోను రాజకీయాలకు ముడిపెడుతూ ఒక వర్గానికి చెందిన వారికి అనుకూలంగా రహదారులు నిర్మిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. నగరంలో మెయిన్‌రోడ్ నుంచి సినిమా హాలుకు వెళ్లే రహదారి 120 మీటర్లు, నగరం గొడపాలెంలో మరో 60 మీటర్ల రహదారి బాగున్న వాటిపైనే సీసీ రోడ్లను వేశారు. రహదారుల నిర్మాణంలోను రాజకీయాలు ప్రదర్శించడం సరికాదని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

అదే విధంగా మండలంలోని ధూళిపూడి, అద్దంకివారిపాలెం గ్రామాలలోను అదే తరహాలో బాగున్న రహదారులపై సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి పరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లో లెవెల్‌లో ఉండటంతో మరలా వేస్తున్నాం

రహదారులు అధ్వానంగా ఉన్న వాటికే సీసీ రహదారులు వేస్తున్నాం. నగరంలో లో లెవెల్‌లో ఉండడం వల్ల 120 మీటర్ల మేర సీసీ రోడ్డుపై మరలా సీసీ రహదారులు వేయాల్సి వచ్చింది.
– సురేంద్ర, పంచాయతీరాజ్ ఏఈ

రైతు సేవా కేంద్రంలో టీవీ మాయం

- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన ఆర్‌బికే సిబ్బంది
- తీసుకెళ్లి.. తిరిగి తీసుకురాని పంచాయతీ కార్యదర్శి
- కార్యదర్శి హామీతో వెనుతిరిగిన ఆర్‌బీకే సిబ్బంది

బాపట్లటౌన్: రైతులకు వ్యవసాయ రంగంలో వస్తున్న అధునాతన పద్ధతులు, చీడపీడల నివారణ, యాంత్రీకరణ విధానంపై సలహాలు, సూచనలు ఇచ్చేందుకు గత ప్రభుత్వంలో ప్రతి రైతు భరోసా కేంద్రానికి 43 అంగుళాల సామ్‌సంగ్ కంపెనీకి చెందిన టీవీలను అందజేశారు. అడవి–2 రైతు భరోసా కేంద్రం ముత్తాయపాలెం పాత పంచాయతీ కార్యాలయం భవనంలో నిర్వహిస్తున్నారు. అడవి–2 ఆర్‌బీకేకు చెందిన టీవీను ఏడాదిన్నర క్రితం సూర్యలంక గ్రామంలో జేసీ ప్రోగ్రామ్‌లో రైతులకు సలహాలు ఇచ్చేందుకు పంచాయతీ కార్యదర్శి ముత్తాయపాలెం నుంచి సూర్యలంక తీసుకెళ్లారు. అప్పటి నుంచి తిరిగి తీసుకురాలేదు. అయితే అడవి–2 ఆర్‌బీకేలో వీఏవోగా విధులు నిర్వర్తించే గ్లోరి సెలవుపై వెళ్లడం.. ఆమె ఏడాదిన్నర తర్వాత తిరిగి వచ్చి చూస్తే టీవీ లేకపోవడంతో తోటి ఉద్యోగులను ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి తీసుకెళ్లాడని చెప్పడంతో ఆమె అడిగారు. అడవి పంచాయతీ సిబ్బంది మేము టీవీను తీసుకొచ్చి ముత్తాయపాలెం పంచాయతీ కార్యాలయంలో పెట్టామని చెబుతున్నారు. ఇక్కడున్న సిబ్బంది ఇక్కడకు తీసుకురాలేదంటున్నారు. దీనిపై శుక్రవారం ఆర్‌బీకే సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న అడవి పంచాయతీ కార్యదర్శి బాబురావు టీవీ తీసుకెళ్లిన సమయంలో ఉన్న కార్యదర్శి చనిపోయారని, సిబ్బందిని విచారించి సమస్యను రెండు రోజుల్లోగా పరిష్కరిస్తానని చెప్పడంతో సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయకుండా తిరిగొచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



ఇంటూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు



దుండిపాలెం రెవెన్యూ సదస్సులో తహసీల్దారు నాగరాజు

అమర్తలూరు(వేమూరు): రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు నెహ్రూ అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగిందని, 13 అర్జీలు అందజేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): రైతుల భూములకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించడం జరుగుతందని తహసీల్దారు నాగరాజు తెలిపారు. చుండూరు మండలంలోని దుండిపాలెం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగిందని, 5 అర్జీలు అందజేశారని తహసీల్దారు తెలిపారు. పొలం సర్వే చేయడం జరుగుతుందన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తామని ఆయన రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించడం సరికాదు

సమాజ్‌వాదీ పార్టీ జిల్లా అధ్యక్షులు మేధ శ్రీనివాసరావు



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న సమాజ్‌వాదీ పార్టీ నాయకులు

బాపట్లటౌన్: బడుగు, బలహీన వర్గాల ఆశాదీపమైన అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించడం కేంద్ర మంత్రిగా ఉన్న అమిత్ షాకు సరికాదని సమాజ్‌వాదీ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేధ శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో అమిత్ షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై సంధించిన వ్యంగ్యాస్త్రాలకు నిరసనగా శుక్రవారం సాయంత్రం సమాజ్‌వాదీ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మేధ శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేడ్కర్ చేసిన చట్ట సవరణలు స్ఫూర్తిదాయకమన్నారు. అమిత్ షా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకులు శ్యామ్ లివింగ్‌స్టన్, డాక్టర్ వరప్రసాదరావు, శరత్‌కుమార్, చిన్న వెంకటేశ్వరరావు, సూరిబాబు, ఫణీంద్రకుమార్, భాస్కరరావు, తాతయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు తగవు

రేపల్లె రూరల్: కేంద్ర మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేయటం పట్ల ప్రజా సంఘాలు భగ్గుమన్నాయి. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పలు ప్రజా సంఘాలు శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ దోవా రమేష్‌రాంజీ, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు సీహెచ్ మణిలాల్‌లు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అమిత్ షా పార్లమెంటరీ సభ్యత్వం రద్దు చేయాలని, మంత్రి పదవి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం రచించి దేశానికి దశ దిశ చూపిన అంబేడ్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయటం అమిత్ షా దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు సాంబశివరావు, ప్రతాప్, దీనరాజు, వెంకటేశ్వరరావు, కృష్ణప్రసాద్, జోజిబాబు, సురేష్, బీఎస్పీ నాయకులు సుధీర్, వెంకటరావు నాయుడు, సుబ్బారావు, లక్ష్మణరావు, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని శుక్రవారం తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం జనవరి 7వ తేదీ వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వేమూరు: వేమూరు మండలంలోని జంపని గ్రామంలో గ్రామ సచివాలయం వద్ద శనివారం ఉదయం 11 గంటలకు రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు సుశీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులో అందజేయాలని ఆమె కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



సూరేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శ్రీసాయిరామ వీవో పరిధిలోని వాకా వజ్రం స్వగృహంలో పురుగులు ఆశించకుండా దశపర్ణి తయారు చేసే విధానాన్ని మాస్టర్ ట్రైనర్ నీలం ప్రకాష్ కుమార్, యూనిట్ ఇన్‌చార్జ్ దోవా ఝాన్సీరాణిల ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా రైతులకు చేసి చూపారు. ఈ ద్రావణంలో మేక, గొర్రెలు తినని 10 రకాల ఆకులతో పాటు కిలో పచ్చిమిర్చి, అర కిలో పసుపు, కిలో వెల్లుల్లి, అర కిలో అల్లం, అరకిలో ఇంగువతో దశపర్ణి ద్రావణాన్ని తయారు చేశారు. రైతులు ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని మాని కషాయాలను వాడటం వల్ల ఖర్చు తగ్గుతుందని తెలిపారు. ఐసీఆర్పీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



చెరుకుపల్లి: చట్టాలపై మహిళలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ రిసోర్స్ పర్సన్, సీనియర్ న్యాయవాది ఎస్‌వీఏ ఝాన్సీ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విధాన్ సే సమాధాన్ జాతీయ మహిళా కమిషన్ జాతీయ న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఝాన్సీ మాట్లడుతూ మన దేశంలో మహిళల రక్షణ, అభ్యున్నతికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని సూచించారు. ప్రతి మహిళ గృహహింస, బాల్య వివాహాలు, వరకట్నం చట్టంపై మహిళలకు అవగాహన కల్పించారు. 30 మంది కంటే ఎక్కువ మంది పని చేసే ప్రదేశాల్లో ప్రత్యేక రక్షణ, భద్రత చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళలు పనిచేసే కార్యాలయాల్లో ఎవరైనా లైంగికంగా వేధించినా, అమర్యాదగా, అసభ్యకరంగా ప్రవర్తించినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కట్టా కాళిదాసు, ఎస్సై అనిల్‌కుమార్, ఈఓపీఆర్డీ కేజీఏ శ్రీనివాసన్, మహిళలు పాల్గొన్నారు.

యాంత్రీకరణతోనే అధిక దిగుబడులు

పోస్ట్‌హార్వెస్ట్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏడుకొండలు



బాపట్లటౌన్: యాంత్రీకరణతోనే అధిక దిగుబడులు సాధ్యమని పోస్ట్‌హార్వెస్ట్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. మండలంలోని కంకటపాలెం గ్రామంలో శుక్రవారం రైతులకు యాంత్రీకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ రైతు స్థాయిలో వరిని ప్రాసెస్ చేసుకునేందుకు ఉపయోగించే చిన్న చిన్న మిల్లింగ్ మిషనరీలు, రైస్ రవ్వ, పొడి తయారుచేసే యంత్రాలు, నూనె గింజల నుంచి నూనె తీసుకునే యంత్రాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో విలువను జోడించడం ద్వారా రైతులు లాభం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వాసు దేవరావు, సందీప్ రాజా, సునీల్ చౌదరి, అబ్రహం, రత్నం అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం చోరీ

అమర్తలూరు(వేమూరు): జగనన్న కాలనీలోని ఓ ఇంటిలో బంగారం దొంగతనం చేశారని బాధితులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ జానకి అమర్‌వర్ధన్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం అమర్తలూరు మండలం మూల్పూరు గ్రామంలోని జగనన్న కాలనీలో మెరుగమళ్ల నరేంద్ర ఇంటిలో దొంగతనం జరిగిందని తెలిపారు. మెరుగమళ్ల నరేంద్ర కుమారుడు ఆదిత్య భీమవరంలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం మూల్పూరు వచ్చిన ఆదిత్యను గురువారం తల్లిదండ్రులు తెనాలి వెళ్లి భీమవరం పంపించారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి మూల్పూరు వచ్చి సాయంత్రం 4 గంటలకు విత్తనాలు వేసేందుకు పొలం వెళ్లారు. ఇంటి వచ్చేసరికి బీరువాలోని నల్లపూసల దండ, చైన్, చెవి దుద్దులు పోయినట్లు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ జానకి అమర్‌వర్ధన్ తెలిపారు. గురువారం అర్ధరాత్రి కేసు నమోదు చేశామని, దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బాపట్లటౌన్: పేకాట స్థావరంపై శుక్రవారం వెదుళ్ళపల్లి పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ పి.జనార్ధనరావు తన సిబ్బందితో శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించి, స్టూవర్టుపురం శివారు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు, రూ.1470 నగదు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



వేమూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లోని గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

బాపట్లటౌన్: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. పట్టణంలోని జమ్ములపాలెం ఫ్లైఓవర్ సమీపంలో రైలు పట్టాలపై సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి బాపట్ల నుంచి చెన్నై వైపు వెళ్లే రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడు తెల్లరంగు చొక్కా ధరించాడు. ఈ మేరకు రైల్వే ఎస్ఐ ఎల్ సర్వసతి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.